క్లుప్తంగా

పనులను త్వరగా పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్‌టీఆర్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, సూపర్‌వైజర్ శివ, మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లో శనివారం సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలివ్ మిఠాయి దొరరాజును సన్మానించారు. మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభినందన



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కూకట్‌పల్లి: నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో కూకట్‌పల్లి వివేకానందనగర్ శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 197 మంది విద్యార్థులు ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచారు. శనివారం విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యకళ, డీన్ శ్రీహరి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

పాఠశాల వార్షికోత్సవం



కేపీహెచ్‌బీకాలనీ: వసంత్‌నగర్‌లోని బబుల్స్ ప్లే స్కూల్ 14వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు యోగా, కరాటే, నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. తమ పాఠశాల విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా రూపొందించిన కార్యక్రమాల్లో భాగంగా వివిధ ఆటపాటలు, పండుగలు, దేశభక్తి విశిష్టతను తెలిపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ శ్రీలక్ష్మి తెలిపారు.

రాష్ట్రపతి భవన్‌లో విద్యార్థుల సందడి

గచ్చిబౌలి: రాష్ట్రపతి భవన్‌లో కొండాపూర్‌లోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు. శనివారం బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు. సుగంధ ద్రవ్యాల మొక్కలు, పూల మొక్కలను చూపించి వాటి గురించి వివరించారు.

ఈ నీరు తాగేదెలా..?

- కలుషిత నీటి సరఫరాతో ప్రజల అవస్థలు
- చర్మ వ్యాధుల బారిన పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



మందుల బస్తీలో వాల్వ్ వద్ద చెత్త తీస్తున్న స్థానికులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో కొన్ని రోజులుగా తాగునీటిలో మురుగు నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోజుల తరబడి కలుషిత నీరు సరఫరా అవుతున్నా జలమండలి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తుండడంతో దుర్వాసన వస్తోందని ఆవేదన చెందుతున్నారు. డివిజన్ పరిధిలోని హరిజన బస్తీ, అంజయ్యనగర్, హస్మత్‌పేట, ముస్లీం బస్తీ, బడేమసీద్, లైన్స్ టౌన్ కాలనీ, భవానీనగర్, ఎల్‌బీనగర్, మల్లికార్జునగర్, అబ్రహర్‌నగర్ ప్రాంతాలలో మురుగు నీరు సరఫరా అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మురుగు నీరు తాగడంతో కొందరు చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. మరికొందరికి దురద, దగ్గు, జలుబు, జ్వరం, వాంతులతో ఆస్పత్రుల్లో చేరుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఎల్‌బీనగర్, భవానీనగర్, హరిజన బస్తీ, హస్మత్‌పేట్, అంజయ్యనగర్ ప్రాంతాల్లోని గేట్‌వాల్వ్ దగ్గర కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో ఆ నీరు తాగిన ప్రజలకు చర్మ వ్యాధులు, దురద ఇతరత్రా రుగ్మతలు అంటుకుంటున్నాయి. దీంతో పాటు గేట్‌వాల్వ్ వద్ద పైపులైన్ లీకేజీలతో రహదారులపై నీరు ప్రవహిస్తోంది.

చర్మ వ్యాధులతో ఆరోగ్య కేంద్రాలకు..

గత వారం రోజుల నుంచి ఓల్డ్‌బోయిన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చర్మ వ్యాధులతో జనం పోటెత్తుతున్నారు. రోజురోజుకు ఈ చర్మ వ్యాధిగ్రస్తులు అధికమవుతుండడంతో డాక్టర్లు, సిబ్బంది ఆరా తీయగా తమకు సరాఫరా అవుతున్న నీరు కలుషితమై వస్తుండడంతో చర్మవ్యాధులు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. కాళ్లకు, చేతులకు బొబ్బలు రావడం, చర్మం పొలిపోయి దురద వస్తుండడంతో పాటు శరీరం మొత్తం పాకుతుందని ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఏదో ఒక పని చేసుకుని జీవనం సాగించే తమకు ఈ వ్యాధి వలన పనులకు వెళ్లలేక చికిత్స తీసుకుంటూ ఇంటికే పరిమితం కావాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తమకు సోకిన చర్మ వ్యాధిని చూపిస్తున్న స్థానికులు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జలమండలి అధికారి

తాగునీటిలో మురుగు నీరు వస్తున్న విషయం స్థానిక ప్రజలు జలమండలి మేనేజర్ దృష్టికి తెచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జలమండలిలో పని చేస్తున్న సిబ్బందితో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆదాయం లేనిదే పని చెయ్యడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా మీటింగ్‌ల పేరుతో కార్యాలయానికి రాకపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న అధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సత్యసాయినగర్‌లో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్యసాయినగర్ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను కార్పొరేటర్ తన దృష్టికి తీసుకువచ్చారని, దీంతో అధికారులతో సంప్రదించి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యపై స్పందించి వెంటనే పరిష్కారం చూపినందుకు స్థానికులు ఎమ్మెల్యే కృష్ణారావుకు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంచి భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్, తుమ్మ జగదీష్, మల్లేష్, కవిత, మహేష్, వెంకటేష్, కన్నయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించాలి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు రాజ్‌పాల్‌సింగ్ తదితరులు

మూసాపేట: ఆంగ్ల భాషా నైపుణ్యాన్ని విద్యార్థులు అభివృద్ధి చేసుకుంటే అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు సాధించి దేశ కీర్తి ప్రతిష్టలను పెంచవచ్చని మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్‌పాల్‌సింగ్ అన్నారు. శనివారం రాష్ట్ర స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీల్లో భాగంగా శనివారం జరిగిన మండల స్థాయి పరీక్షలకు ఆయన హాజరయ్యారు. ఈ పరీక్షల్లో గెలిచి మేడ్చల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వాచీలను బహూకరించారు. కార్యక్రమానికి ఆంగ్ల ఉపాధ్యాయుడు రాజిరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఝాన్సీ, కృష్ణయ్య, రాములు, ఇతర పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: ప్రజలు అవగాహన లేకపోవటంతో చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని, అలా వేయకుండా ఉదయం వచ్చే ఆటో కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ చౌరస్తాలో గాయత్రినగర్, తులసీనగర్ వాసులకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం తమ వద్దకు వచ్చే ఆటో వారికి చెత్త అందించాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేయడంతో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. మూగజీవాలు చెత్త తిని అనారోగ్యాల బారిన పడతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, సర్కిల్ ఇన్‌చార్జి హరికృష్ణ, ఎస్‌ఆర్‌పీ సురేష్, ఎస్‌ఎఫ్‌ఏ అరుణ్, ఎస్‌ఎఫ్‌ఎస్ సురేష్, డబ్ల్యూఎఫ్‌ఏ శాంతి తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర కాలనీలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని విశ్వంభర కాలనీ ప్రాంతాన్ని శనివారం స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో నూతన పార్కులు, ఓపెన్ జిమ్, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసి త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కేపీహెచ్‌బీ కాలనీలో అనేక పార్కులు, ఇండోర్ స్టేడియాలు అందుబాటులోకి వచ్చాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. పార్కుల్లో అన్ని రకాల సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాలనీవాసులు వై.బోస్, బైరెడ్డి తులసిరెడ్డి, వెంకటేశ్వరరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, అనిల్, నగేష్, నరేంద్ర, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈపీటీఆర్ఐ, ఆర్‌జీయూకేటీ మధ్య ఒప్పందం



గచ్చిబౌలి: ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్), ఆర్‌జీయుకేటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) బాసర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. విద్య, పరిశోధన, శిక్షణ రంగాలలో సహకరించడానికి జరిగిన ఒప్పందంపై టీపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట రమణ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ ప్రభావ అంచనా, వ్యర్థాల నిర్వహణ తదితర రంగాలలో పరిశోధనలు చేసేందుకు వీలుంటుందన్నారు. ఆర్‌జీయుకెటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట రమణ మాట్లాడుతూ పర్యావరణ ఆవిష్కరణలకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల, డాక్టర్ స్వరాజ్, డాక్టర్ శేష శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నడ్డా వర్చువల్ సమావేశంలో బీజేపీ నేతలు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు విజయశాంతి, హరీష్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో బూత్ కమిటీల వర్చువల్ మీటింగ్ శనివారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి అసెంబ్లీ పాలక్ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి విచ్చేసి కూకట్‌పల్లి బీజేపీ నాయకులతో బూత్ కమిటీలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట కార్పొరేటర్ కె.మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన కార్యకర్తలు

కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో టాలెంట్ టెస్ట్



టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో శనివారం తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం, మేడ్చల్ జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా మేడ్చల్ జిల్లా సెక్రటరీ శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారిని స్టేట్ టాలెంట్ టెస్ట్‌కు పంపిస్తామని ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు శివాజీ, ఆర్గనైజ్ సెక్రటరీ మధన్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనయ్య పాల్గొన్నారు.

సన్మానం



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నివాసానికి శనివారం తానా అధ్యక్షుడు లావు అంజయ్య చౌదరి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి దయార్‌గూడకు చెందిన 13 సంవత్సరాల బాలుడు జక్కుల ధనుష్‌కుమార్ గత 7 సంవత్సరాలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయాన్ని దయార్‌గూడకు చెందిన మేకల రమేష్, గుండమళ్ల రాజేందర్‌లు కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన శనివారం వారిని కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావుకు ధనుష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నాం

దుండిగల్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శనివారం మల్లంపేట్ 26వ వార్డులో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూనతంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయని, స్థానికంగా సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కేవీఆర్ కాలనీ ప్రెసిడెంట్ చంద్ర, ప్రణీత నేచర్ బౌంటీ కాలనీ ప్రెసిడెంట్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ అమృత, కాలనీ సభ్యులు సురేష్ పాల్గొన్నారు.



శుభాకాంక్షలు



ప్రొ.సురేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ విశ్వ విద్యాలయంలో నూతనంగా పూర్వ విద్యార్థుల విభాగానికి డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొ.జే.సురేష్‌కుమార్‌ను యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయం అభివృద్ధికి పూర్వ విద్యార్థుల పాత్ర చాలా ముఖ్యమైనదని, వారంతా ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, రాజకీయ నాయకులుగా అత్యున్నత స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. చరిత్ర యూనివర్సిటీ విద్యార్థులకు ఉందన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి, అధ్యక్షుడు మంద రంజిత్‌కుమార్, వైస్ చైర్మన్ ధరమ్‌సోతు శ్రీనివాస్ నాయక్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బల్లగ్ సందీప్, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబీర్ చెరువులో దోమల మందు పిచికారీ



అంబీర్ చెరువులో దోమల మందు పిచికారీ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్‌చెరువులో శనివారం ఎంటమాలజీ సిబ్బంది డ్రోన్ సహాయంతో దోమల మందు పిచికారీ చేశారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎంటమాలజీ ఏఈ ఉషారాణి ఆధ్వర్యంలో సిబ్బంది చెరువులో దోమల మందు పిచికారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి వారం పరిసరాలను తనిఖీ చేసుకొని నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమలను నివారించవచ్చన్నారు.

రూ.1.76 కోట్లతో కొత్తకుంట అభివృద్ధి



కొత్తకుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు, నాయకులు

హఫీజ్‌పేట్: కొత్తకుంట అభివృద్ధి కోసం రూ.1.76 కోట్లను వెచ్చించనున్నట్లు ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్‌లోని కొత్తకుంటను ఆయన నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకుంట కలుషితం కాకుండా డ్రైనేజీ వ్యవస్థ మళ్లింపు పనులు వేగవంతం చేయాలని, చేపట్టే పనులలో నాణ్యత పాటించాలని సూచించారు. చెరువు సుందరీకరణలో భాగంగా చెరువుకట్ట పటిష్టం చేయడం, పునరుద్ధరించడం, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే కాలువ, అలుగు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ వంటి పనులను చేయడం జరుగుతుందన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ మేర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ నళిని, నాయకులు గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మారెడ్డి, వెంకటేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, దాత్రిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

